ప్రజా విశ్వంభర V3 NEWS

యువత రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నారు

దయచేసి వారికి గోడలు కట్టవద్దు: మన్నె క్రిశాంక్

విశ్వంభర, హైదరాబాదు : వత రాజకీయాల్లోకి రావాలని అనుకుంటున్నారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తెలిపారు. దయచేసి వారికి గోడలు కట్టకండి అని కోరారు. కేసీఆర్, కేటీఆర్ వంటి నాయకత్వంలో పనిచేసేందుకు రాజకీయాల్లోకి రావాలని అనుకుంటున్నారని పేర్కొన్నారు. మేం గులాబీ జెండాలు ఎత్తాలి.. తెలంగాణను మళ్లీ అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని అన్నప్పుడు.. కొత్త రక్తాన్ని రానివ్వాలని అన్నారు. కానీ నువ్వు అక్కడికి పోవాలంటే పర్మిషన్.. నువ్వు ఇక్కడికి పోవాలంటే పర్మిషన్ .. నువ్వు చెప్పిపోవాలంటే అది రాజకీయం కాదు.. బానిసత్వం అవుతుందని అన్నారు. మనం తెలంగాణ కోసం కొట్లాడిందే బానిసత్వం లేని స్వేచ్ఛ కోసం, ఆత్మగౌరవం కోసమని తెలిపారు. అందరి దగ్గరకు వెళ్లండి.. మీకు నచ్చిన వారి దగ్గరకు వెళ్లండి.. కలిసి పనిచేయండని మన్నె క్రిశాంక్ సూచించారు. వ్యక్తులు శాశ్వతం కాదు.. పార్టీనే శాశ్వతం అని స్పష్టం చేశారు. గత ఉప ఎన్నికల సమయంలో మనల్ని చాలా అవమానపరిచారని గుర్తుచేశారు. గెలుపోటములు సహజం కానీ.. ఉప ఎన్నికల సమయంలో పైశాచికత్వంగా ప్రవర్తించారని తెలిపారు. కారు గుర్తును బుల్డోజర్‌తో తొక్కి తొక్కి ఇటుతిప్పి, అటుతిప్పి చేసిండ్రు అని అన్నారు. దానికి మనం ప్రతీకారం తీర్చుకోవాలంటే పోరాడాలని సూచించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో మన్నె క్రిశాంక్ పాల్గొని మాట్లాడు తూ.. తెలంగాణ ఉద్యమం 2009లో ఓయూలో మొదలైందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తెలిపారు. ఉద్యమకాలంలో పాల్గొన్న యువ నాయకులను కేసీఆర్ రాజకీయంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. పార్టీ ఆశయాలతో పాటు వ్యవస్థ బాగుకోసమే సభ్యత్వ నమోదు చేపట్టారని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను నిలదీసేలా యువతను జాగృతం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు మనకు అండగా కేసీఆర్, కేటీఆర్ ఉన్నారనే భరోసా ఉంటుందని అన్నారు. ఏ కొత్త ఆలోచన చేసినా కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.

సిపిఎం పార్టీ యువ కార్యకర్తల సమావేశాలు

విశ్వంభర, సరూర్ నగర్: జూన్ 16,17 తేదీలలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ యువ కార్యకర్తల సమావేశాలు రెండు రోజులపాటు కొత్తపేట జగ్జీవన్ రావు భవనంలో జరుగుతున్నట్లు సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం చంద్రమోహన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు . అనంతరం డివైఫ్ఐ కమిటీ వేశారు. అధ్యక్షుడిగా మహేందర్, కార్యదర్శిగా శివ, ఉపాధ్యక్షులుగా మహేష్ , సహకార దర్శి అభి, లింగస్వామి, ప్రతాప్ యాదవ్, పద్మయ్య, పదిమందితో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, వనస్థలిపురం శాఖ కార్యదర్శి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి 3 గంటలు కరెంట్ చాలని అధికారికంగా కాంగ్రెస్ పార్టీ వాదనలు

ఈఆర్సీ ముందు రికార్డై ఉంది : హరీశ్ రావు

విశ్వంభర, హైదరాబాద్: రైతులకు 24 గంటల కరెంటు అవసరం లేదు.. మూడు గంటలు చాలని ఓ వైపు సీఎం రేవంత్ రెడ్డి.. మరోవైపు రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్ అయ్యారు. ఈ విషయమై హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ..ఈ ప్రభుత్వ విధానం చూశాం. గతంలో రేవంత్ రెడ్డి రైతులకు మూడు గంటలు కరెంట్ చాలు అని చెప్పారు. నిన్న రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి రైతులకు 3 గంటల కరెంటు చాలని కాంగ్రెస్ ప్రభుత్వం తరుపున, కాంగ్రెస్ పార్టీ తరపున రైతు కమిషన్ చైర్మన్‌గా అధికారిక హోదాలో ఆయన వాదనలు వినిపించారు. అధికారికంగా ఈఆర్సీ ముందు మినిట్స్ రికార్డు అయినయ్. రైతాంగానికి మూడు గంటలు కరెంట్ చాలని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ఈఆర్సీ ముందు వాదనలు వినిపించింది. అది ఈ రోజు ఈఆర్సీ ముందు రికార్డై ఉంది. రేవంత్ రెడ్డి కూడా 3 గంటలుచాలన్నడు. రేవంత్ రెడ్డిలాగా అబద్దాలు మాట్లాడుడు మాకు ఇంటా వంటా లేదు. మాకు నీతి, నిజాయితీ తెలుసు.. ఏది మాట్లాడినా పద్ధతి తెలుసు. ఆధారాలతో, లెక్కలతో మాట్లాడుతం. రేవంత్ రెడ్డిలాగా బట్ట కాల్చి మీదేయడమో.. అబద్దాలు మీదేసి పబ్బం గడుపుకునే మాకు ఇంటా వంటా లేదన్నారు. నువ్వు 24 గంటల విద్యుత్ ఈ తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ఇస్తేనే ఓట్లడుగుతా అని చెప్పు దమ్ముంటే.. లేకపోతే నీకు దమ్ముంటే ఓట్లు అడుగను అని చెప్పు. రాష్ట్ర రైతాంగానికి ఇప్పుడే కరెంట్ రావట్లేదు. ఈ రోజు ఏ ఊరికన్నా పోదాం. ఈ మధ్యకాలంలో నేను నర్సాపూర్ సబ్‌స్టేషన్‌కు వెళ్లిన. జహీరాబాద్ సబ్‌స్టేషన్కు వెళ్లిన, సిద్దిపేటలో సబ్‌స్టేషన్‌కు వెళ్లిన ఎక్కడికి వెళ్లినా రైతులకు ఈ రోజే 13 గంటలకు మించి కరెంట్ రావడం లేదు.

నువ్వేదో 24 గంటలు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు నేను ఆర్‌పీడీసీఎల్ పెడుతున్నా అని చెప్పివవ్. నువ్వువచ్చిన తర్వాత 24 గంటలవిద్యుత్‌కు మంగళం పాడినవ్. ఈ రోజు రాష్ట్రంలో ఏ రైతుకు కూడా 13 గంటలకు మించి ఉచిత విద్యుత్ రావడం లేదని అన్నారు. ఇవాళ నీ ఆర్‌పీడీసీఎల్ ఏర్పాటుతో 8-9 గంటలు కూడా రాని పరిస్థితి ఏర్పడుతదని హరీశ్ రావు పేర్కొన్నారు. నాకు నీ బడేబాయ్ (నరేంద్ర మోదీ) చెప్పినట్టు అనిపిస్తుంది. గుజరాత్‌లో ఇవాళ కేవలం 7 గంటల కరెంటే వస్తది. కాంగ్రెస్ పాలిస్తున్న కర్ణాటకలో 8 గంటలు మాత్రమే వస్తుంది. రేపు తెలంగాణలో కూడా అదే జరుగబోతుంది. ఇది నేను ఉత్తగనే మాట్లాడటం లేదు. మొన్న ఆర్‌పీడీసీఎల్ ఏర్పాటు సందర్భంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవ్ నంబర్ 8. ఈ జీవో ప్రజలకు అందుబాటులో పెడతా. రినెవెబుల్ ఎనర్జీ (సోలార్ పవర్) టీజీఆర్‌పీడీసీఎల్‌కు కేటాయించినమని చెప్పిర్రు. సోలార్ పవర్ పొద్దున సూర్యోదయమై 7 గంటలకు మొదల వుతది.. సూర్యాస్తమమయ్యే 6గంటలకు సోలార్ పవర్ ఆగిపోతది.

అంటే రైతులకు , లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లకు, మంచినీటి పథకాలకు టీజీఆర్‌పీడీ సీఎల్ కింద ప్రభుత్వం పెట్టేసింది. మరి టీజీఆర్‌పీడీసీఎల్‌కు రేవంత్ రెడ్డి ఏకరెంట్ ఇస్తా అంటున్నడు.. సోలార్ పవర్ ఇస్తా అంటున్నడు. థర్మల్ పవర్, హైడల్ పవర్ ఇయ్యడట. కేవలం సోలార్ పవర్ ఇస్తా అంటున్నడు.. మరి సోలార్ పవర్ ఎప్పుడుం టది. పొద్దున 7గంటలకు వస్తది.. సాయంత్రం 5 గంటలకు పోతది. అంటే 8-9 గంటలుం టది.. రేవంత్ రెడ్డి ఈ జీవో ద్వారా చెప్పకనే ఏం చెప్పిండంటే.. రేపు రాష్ట్రంలో రైతులకు ఈ జీవో ద్వారా 8-9 గంటలు కరెంట్ ఇస్తా అని ఈ జీవోలోచాలా స్పష్టంగా చెప్పిన్రు. అందుకే రేవంత్ రెడ్డిని 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తా అంటేనే నువ్వు ఓట్లడుగు దమ్ముంటే.. అని చాలెంజ్ చేస్తున్నానన్నారు .

“మీ సురక్ష” పై అవగాహన

విశ్వంభర, నాగోల్ : నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడలో ని ఇందు ఆరణ్య అపార్ట్‌మెంట్స్‌లో “మీ సురక్ష” కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నాగోల్ ఇన్స్పెక్టర్ మగ్బుల్ జాని హాజరై మాట్లాడుతూ “మీ సురక్ష” కార్యక్రమం యొక్క ప్రాముఖ్యత, నమోదు, ధృవీకరణ విధానం, అత్యవసర సేవలు, మహిళలు పిల్లల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన, పోలీస్ సహాయక సేవలు మరియు హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై వివరించారు. ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, తమ ప్రాంత భద్రత మరియు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ లు పి. శివనాగ ప్రసాద్ , పి. దశరథ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో గాలివాన బీభత్సం.. రోడ్డుపై కూలిన చెట్లు

విశ్వంభర, పెద్దపల్లి: జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఆదివారం సాయంత్రం ఈదురుగాలులకు తోడు వర్షం కురవడంతో పలుచోట్లు రహదారిపై చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ధర్మారం మండల కేంద్రంలో ఇంటి రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ధర్మారం మండల కేంద్రంలో గాలివాన జనజీవనాన్ని స్తంభింపజేసింది. ఓదెల మండలంలో గాలివాన అందుకోవడం.. పలు గ్రామాల్లో కరెంటు నిలిచిపోయింది. గాలివాన కారణంగా ఎర్రగుంటపల్లి గ్రామం వద్ద కరీంనగర్ రాయపట్నం రహదారిపై మర్రి చెట్టు కూలిపోయింది. దాంతో, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ధర్మారం మండల కేంద్రంలో గాలి తీవ్రతకు బీఆర్ఎస్ నాయకుడు గాజుల రాజు ఇంటి రేకులు లేచి కింద పడ్డాయి. సమీపంలోని రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడగా.. తీగలు తెగిపడ్డాయి.
దాంతో, ధర్మారంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి చీకటి అలుముకుంది.

కోహెడ సమీకృత మార్కెట్ దేశానికే తలమానికం

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

విశ్వంభర, అబ్దుల్లాపూర్‌మెట్ : కోహెడ లో నిర్మిస్తున్న అంతర్జాతీయ సమీకృత మార్కెట్ దేశానికే తలమానికం అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. అదివారం కోహెడ మార్కెట్ శంకుస్థాపన నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ ముఖ్య కార్యదర్శి కె సురేంద్ర మోహన్ , ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ,మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మి బాయి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి , ఇతర ఉన్నత అధికారులు, పాలకవర్గం సభ్యులు కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తో పాటు అధికారులు సభ ప్రాంగణాన్ని తిరిగి పరిశీలించారు.. కొన్ని మార్పు చేర్పులను సూచనలను సంబంధిత అధికారులకు తెలియ చేశారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, కోహెడ లో నిర్మించే మార్కెట్ దేశానికే దిక్సూచిగా మారుతుందని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కోహెడ పండ్ల మార్కెట్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.రైతులకు వ్యాపారులకు వినియోగ ్దారులకు అందుబాటులో ఉండే విధంగా అన్ని సౌకర్యాల తో కూడిన ఏర్పాట్లు మార్కెట్ లో ఉంటాయని తెలిపారు.. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , శంకుస్థాపన కార్యక్రమం లో వేలాది మంది రైతులు మహిళలు పాల్గొంటారని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అన్నదానం

విశ్వంభర, ఖైరతాబాద్ : హైదరాబాద్ లక్డీకాపూల్ ప్రాంతంలోని నీలోఫర్, ఎంఎన్‌జే ఆస్పత్రుల వద్ద రెడీ టూ సర్వ్ ఫౌండేషన్, అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రులకు చికిత్స కోసం వచ్చిన రోగులు, వారి బంధువులు, నిరుపేదలు, అవసరమైన వారికి రుచికరమైన భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు స్వచ్ఛందంగా పాల్గొని వందలాది మందికి ఆహారం అందించారు. సమాజంలో ఆకలితో బాధపడుతున్న వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఆసుపత్రుల వద్ద నిరీక్షణలో ఉండే పేద రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈ అన్నదానం ఎంతో ఉపయుక్తంగా మారిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ సేవ యజ్ఞంలో పాలుపంచు కునేవారు తమను సంపాదించవచ్చని రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ నిర్వహకులు పెద్దిశంకర్ తెలిపారు.

శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృధికి కృషి

విశ్వంభర, రాజన్న సిరిసిల్ల: శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి సహకారం అందిస్తాం అని నవతేజ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ చైర్మన్ గంద్ర యాదగిరి రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఆలయాన్ని అద్భుతంగా నిర్మాణం చేశారని, ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని వారు పేర్కొన్నారు. కోరుట్లపేట గ్రామశాఖ అధ్యక్షుడు లోకుర్తి బాలమల్లు, ఆలయ నిర్వాహకులు చిదుగు గోవర్ధన్ గౌడ్, సర్పంచ్ ఇల్లేందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, ప్రేమ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

హెల్త్ కార్డ్‌కు లేని తొందర కోతల కెందుకు

పూర్వ ఉద్యోగ సంఘాల జాక్ చైర్మన్ దేవి ప్రసాద్

విశ్వంభర, హైదరాబాద్ : హెల్త్ కార్డ్స్ జూన్ 2 నుండి ప్రారంభం చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఎలాంటి విధి విధానాలు లేకుండానే మే నెల జీతం నుండి 1.5 శాతం హెల్త్ కార్డ్ పేరుతో మినహాయించడం సరైన నిర్ణయం కాదు అని పూర్వ ఉద్యోగ సంఘాల జాక్ చైర్మన్ దేవి ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, నెట్ వర్క్ హాస్పిటల్ యాజమాన్యాలు తమతో ప్రభుత్వం ఎలాంటి ఒప్పందం చేసుకోలేదని , పాత ఒప్పందం ప్రకారం వైద్యం చేసే ప్రసక్తి లేదని స్పష్టం చేసినా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన రాలేదు. ఉద్యోగి కుటుంబానికి వైద్య పరిమితి, అవుట్ పేషెంట్, ఆసుపత్రుల పై నియంత్రణ, ట్రస్ట్ ఏర్పాటు, సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగుల వైద్యం, ఇతర వర్గాల నుండి వచ్చిన సమస్యలను ఇప్పటివరకు చర్చించి నిర్ణయం తీసుకోలేదు.

కానీ ఉద్యోగుల నుండి బేసిక్ వేతనం లో 1.5 శాతం కోత విధించడం వలన ఉద్యోగులకు అనేక అనుమానాలు వస్తున్నాయి, ప్రారంభం కాకముందే కటింగ్ ఎందుకు? జూన్ లో ప్రారంభించి విధి విధానాలపై ఉత్తర్వులు జారీ చేసి కటింగ్ మొదలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. ఉద్యోగులకు రావలసిన ప్రయోజనాలు ప్రభుత్వం 100 రోజులనుండి ఏండ్ల తరబడి గడువు విధిస్తున్నది. కోతలు మాత్రం ఉద్యోగులనుండి అడ్వాన్స్ తీసుకోవడం అన్యాయం ప్రభుత్వం వెంటనే కోతలు రద్దు చేయాలి చేయాలి అని డిమాండ్ చేశారు.

‘ఇంటర్ రీ ఓపెన్‌ను వాయిదావేయండి’

విశ్వంభర, హైదరాబాద్: రాష్ట్రంలో భానుడి భగభగల నేపథ్యంలో ఇంటర్ కాలేజీల రీ ఓపెన్‌ను వాయిదా వేయాలని అధ్యాపక సంఘాలు కోరుతున్నాయి. సోమవారం నుంచి కాలేజీలు పునఃప్రారంభం కావాల్సి ఉండగా, ఇప్పుడే కాలేజీలు తెరువవద్దని కోరుతున్నాయి. కాలేజీల రీ ఓపెన్‌ను 8కి వాయిదా వే యాలని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీ మధు సూ న్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భరించలేని ఎండలున్నాయని, వారం రోజులు సెలవులు పొడిగించాలని కోరారు. మైనారిటీ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షుడు సయ్యద్ జబీ, తెలం గాణ గె జి టెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ నేతలు సైతం కాలేజీల రీఓపెన్‌ను వాయిదా వేయాలని కోరారు.

మానసిక సమస్యలకు టెలీ మానస్ భరోసా

విశ్వంభర, బండ్లగూడ: తెలంగాణలో మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి భరోసా ఇవ్వడానికి టెలీ మానస్ పేరిట హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేసినట్లు నేషనల్ హెల్త్ మిషన్ అధికారి, ప్రముఖ సైకాలజిస్ట్ పాతనేని వెల్లడించారు. మానసిక సమస్యలపై సలహాలు కావాలనుకున్న వారు, స్వాంతన పొందాల నుకున్న వారు తమ హెల్ప్ లైన్ 14416 నెంబర్ పై ఎప్పుడైనా సంప్రదిం చవచ్చని ఆయన సూచించారు. అహం సూత్ర సోషల్ ల్యాబ్, స్పార్క్ కమ్యూనిటీ హెల్త్ ఆధ్వర్యంలో ఆదివారం పెద దతాళ్లకుంట పార్కులో మానసిక ఆరోగ్యంపై జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమాజంలో రోజు రోజుకు మానసిక సమస్యలు పెరిగిపోతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం కింద ప్రతి రాష్ట్రంలో టెలీ మానస్ హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేసిందని హెల్ప్ లైన్ సూపర్‌వైజర్, సైకాలజిస్ట్ జవహర్‌లాల్ నెహ్రూ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక విశ్లేషకులు ప్రొఫెసర్ కనకయ్య, మల్లికార్జున్‌రెడ్డి, పెద్దతాళ్ల కుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, దుర్గాదాస్, అహం సూత్ర సోషల్ ల్యాబ్ వ్యవస్థాపనకులు రాచూరి అజిత్, జర్నలిస్ట్ మధు తదితరులు పాల్గొన్నారు.

తీవ్రమైన ఎండల ప్రభావం..

ఓయూ డిగ్రీ, పీజీ కాలేజీలకు సెలవులు పొడిగింపు

విశ్వంభర, హైదరాబాద్ : రాష్ట్రంలో తీవ్రమైన ఎండలు, అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఉస్మానియా విశ్వవిద్యాలయం కీలక నిర్ణయం తీసుకుంది. ఓయూ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ డిగ్రీ , పీజీ కళాశాలలకు వేసవి సెలవులను పొడిగిస్తున్నట్లు యూనివర్సిటీ అధికారులు ప్రకటించారు. మే 30, 2026 నాటి అధికారిక ఉత్తర్వులలో, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మే 31తో ముగియాల్సిన వేసవి సెలవులను, ప్రస్తుతం నెలకొన్న వడగాల్పులు మరియు తీవ్రమైన ఎండ తీవ్రతను పరిగణనలోకి తీసుకుని జూన్ 6, 2026 వరకు పొడిగించారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని క్యాంపస్, కాన్స్టిట్యూయెంట్ మరియు అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఈ ఆదేశాలను గమనించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని రిజిస్ట్రార్ కార్యాలయం స్పష్టం చేసింది. తిరిగి జూన్ 8, 2026 (సోమవారం) నుండి అన్ని కళాశాలల్లో విద్యాసంవత్సరం యథావిధిగా ప్రారంభమవడంతో పాటు విద్యా కార్యకలాపాలు పునఃప్రారంభమవుతాయని అధికారులు వెల్లడించారు. ఈ సమాచారాన్ని విద్యార్థులు, అధ్యాపకులు మరియు సంబంధిత సిబ్బంది అందరికీ తెలియజేయాలని కళాశాలల యాజమాన్యాలకు సూచించారు.